క్రీడలతో మానసిక ఉల్లాసం



నగరి: మాట్లాడుతున్న ఎంఈవో శ్రీదేవి



నింద్ర: పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

నగరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను అందిపుచ్చుకుని ప్రతిభను నిరూపించుకోవాలని ఎంఈవో శ్రీదేవి తెలిపారు. స్థానిక కేవీకే మైదానంలో శుక్రవారం బాడ్మింటన్, క్రికెట్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శోభన్‌బాబు, డీఈ నరేష్, ఏఈ రమేష్, టీపీఎం నీరజాక్షి, 4వ వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో బాడ్మింటన్ పోటీలను ఎంపీడీవో లీలామాధవి, ప్రత్యేక అధికారి వాసు పరిశీలించారు.



నగరి : బాడ్మింటన్ పోటీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ప్రత్యేక అధికారి

గంగాధర నెల్లూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సర్పంచ్ మునిరాజా రెడ్డి తెలిపారు. మండలంలోని బుక్కపట్నం గ్రామంలోని క్రీడా మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్, ఈవో పీఆర్‌డీ రాఘవేంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నింద్ర: విద్యార్థులు చిన్న తనం నుంచే క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ దీప తెలిపారు. మండల కేంద్రమైన నింద్రలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆమె పాల్గొన్నారు. క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నటరాజస్వామికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో ఉన్న శివాలయంలో నటరాజ స్వామికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. అరుద్ర నక్షత్ర పూజలు చేశారు.

అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు

నింద్ర: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 31వ తేదీన ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదుచేస్తామని ఎస్‌ఐ శివశంకర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను యువకులు ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

జనావాసాల్లోకి జింక



కుక్కల దాడి నుంచి జింకను కాపాడిన గ్రామస్తులు

గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ తాణా చెర్లోపల్లి సమీపంలో అటవీ ప్రాంతం నుంచి శుక్రవారం జింక గ్రామంలోకి వచ్చింది. గమనించిన కుక్కలు జింకను వెంబడించి దాడికి దిగాయి. గ్రామస్తులు జింకను రక్షించి, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నగరి: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి తెలిపారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్

నింద్ర: మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలుచేస్తున్నాయని సీనియర్ ఇంజనీర్ మునిరామన్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మత్స్యకారుల సహకార సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వాలు క్రెడిట్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. తద్వారా 40 శాతం సబ్సిడీతో రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు రవికుమార్, రామ్మోహన్, హేమంత్, ఎంపీడీవో అరుణ, వైస్ ఎంపీపీ శుభ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

గంగాధర నెల్లూరు: మండలంలోని రామానాయుడుపల్లి వద్ద శుక్రవారం గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు నగరం వినాయకపురానికి చెందిన కుమారస్వామి ఆటో బాడుగ కోసం జీడీ నెల్లూరు మండలం రామానాయుడుపల్లికి వచ్చాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆయన మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసును అప్పటి వెస్ట్ స్టేషన్ సీఐలు అంజు యాదవ్, శివప్రసాద్ దర్యాప్తు చేశారు. మృతుడు మనోహర్ భార్య శారద, కుమార్తెలు పావని, శిరీష, బావమరిది బాబుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో బాబు మృతి చెందాడు. శారద, పావని, శిరీషపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి శిక్ష విధించారు.

తిరుమల ఏఎస్పీగా శివరామిరెడ్డి

తిరుపతి క్రైమ్: తిరుమల ఏఎస్పీగా శివరామిరెడ్డి నియమిస్తూ రాష్ట్ర డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో టీటీడీ ఏవీఎస్‌ఓగా, తిరుమల డీఎస్పీగా కూడా పనిచేశారు. ఇదిలా ఉంటే తిరుమల ఏఎస్పీగా ఉన్న మునిరామయ్య బదిలీ అవడంతో గత కొంత కాలంగా ఖాళీగా ఉంది.

కోర్టులో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

నగరి: స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటుచేసిన కేక్‌ను జడ్జి విష్ణువర్మ కట్‌చేసి పంచిపెట్టారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యవాసగం, ఉపాధ్యక్షుడు వేలాయుధం, కార్యదర్శి జాన్‌జోష్, సహ కార్యదర్శి కే.రాము, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న జడ్జి విష్ణువర్మ

ఆత్మస్థైర్యంతోనే ఉత్తమ ఫలితాలు

కార్వేటినగరం: పదో తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఏఎస్‌డబ్ల్యూవో డి.శ్రీనివాసులు తెలిపారు. శ్రీలక్ష్మీ నరసింహ పాఠశాలలో శుక్రవారం నగరి సహాయ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మంచి ఫలితాలు సాధించడానికి పట్టుదల, క్రమశిక్షణ, ప్రణాళిక అవసరమని చెప్పారు. అదే విధంగా ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు హరిబాబు, వార్డెన్లు వాసు, బాబు, లక్ష్మీ నరసింహ పాఠశాల కరస్పాండెంట్ ధనుంజయ రెడ్డి, దిలీప్, కిషోర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేస్తున్న ఏఎస్ డబ్ల్యూవో శ్రీనివాసులు

వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవాలి

పాలసముద్రం: వ్యాధుల నుంచి పాడి పశువులను రక్షించుకోవాలని పశువైద్యాధికారి భానుప్రసాద్ తెలిపారు. క్రిష్ణజమ్మాపురంలో శుక్రవారం శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ సూపర్‌వైజర్ మారీ ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోనే పాడి పశువులు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో రైతులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గతంలో కురిసిన వర్షాలకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతోందని, పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేయిస్తే పాల దిగుబడి తగ్గిపోతుందని కొందరు రైతులు అపోహలు పడుతున్నారని తెలిపారు. అనంతరం తక్కువ ధరకు క్యాల్షియం, మిరల్‌మిక్చర్ అందజేశారు. 55 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేసి పిడుదల నివారణ మందులు పిచికారీ చేశారు.



పాడి రైతులకు క్యాల్షియం, మిరల్‌మిక్చర్ అందజేస్తున్న భానుప్రసాద్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు


చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి గాయపడిన ఘటన శుక్రవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన సుధాకర్, తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరానికి చెందిన దత్తాత్రేయ పెనుమూరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై పయనమయ్యారు. ఈ క్రమంలో చంద్రగిరి బైపాస్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దత్తాత్రేయకు స్వల్పగాయాలు కాగా, సుధాకర్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిని ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో తిరుపతికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తులో ఉంది.

బావిలో గుర్తు తెలియని మృతదేహం

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం సమీపంలోని శ్రీ సిద్దేశ్వర్ తీర్థ్ ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బావిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆర్సీపురం ఎస్‌ఐ గిరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే ఆర్సీపురం ఎస్ గిరిబాబు ఫోన్ నెంబర్ 94407 96731కు తెలియజేయాలన్నారు.

స్కూళ్లలో శ్రీసిటీ పరిశ్రమలతో పచ్చదనం పెంపు

సత్యవేడు: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పచ్చదనం పెంపునకు పరిశ్రమలు చొరవ చూపుతున్నాయి. ఐసాన్ ఆటో మొబైల్ విడిభాగాల తయారీ పరిశ్రమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా రామచంద్రాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. అంతకు ముందు అంగన్‌వాడీ విద్యార్థులు 60 మందికి రూ. 2 లక్షలు విలువైన విద్యాసామగ్రి, పరికరాలు అందజేశారు. ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ అట్సుషి సకాబే మాట్లాడుతూ పర్యావరణహిత చర్యలకు తమ కంపెనీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ తన సందేశంలో ఐసాన్ పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు.



రామచంద్రాపురం పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఐసాన్ మేనేజింగ్ డైరెక్టర్ అట్సుషి సకాబే

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: పెట్రోల్ పోసి ఓ వ్యక్తిని హతమార్చడానికి ప్రయత్నించిన కేసులో పశ్చిమగోదావరి జిల్లా కోవూరుకు చెందిన జి.గణేష్‌కు ఐదేళ్లు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ సునీత రాణి శుక్రవారం తీర్పు చెప్పారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు అప్పట్లో వెస్ట్ పోలీసులు గణేష్పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



సీఐ సురేష్

నగరి: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం రాత్రి 10 గంటలపైన గుంపులుగా తిరగడం, ఒకే ప్రదేశంలో ఉండడం చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్లపైన, వీధుల్లో కేక్‌లు కట్ చేయవద్దన్నారు. రాత్రి 10 గంటల తర్వాత బార్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు మూసివేయాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకర, అసభ్యకరమైన అంశాలను పోస్టు చేయవద్దని సూచించారు.

శిల్పారామంలో 1న ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

తిరుచానూరు(చంద్రగిరి): ప్రతి సంవత్సరం లాగే ఆంగ్ల నూతన సంవత్సర వేడుకల కోసం శిల్పారామం తిరుపతి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో నగర ప్రజలను అలరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఏఓ ఖాదర్‌వల్లీ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... శాస్త్రీయ నృత్యం, సినీ నృత్యాలు, కామెడీ స్కిట్స్, జానపద కళారూపాలు సాయంత్రం 3 గంటల నుండి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు జబర్దస్త్ కామెడీ కళాకారుడు సునామీ సుధాకర్, నెల్లూరుకి చెందిన భూమిక బృందం సినీ నృత్యాలు, విన్నర్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షో, మ్యాజిక్ షో, గాయకుల గాత్రకచ్చేరి తదితర ప్రత్యేక కార్యక్రమాలతో అలరించనున్నట్లు తెలిపారు. ఇవే కాకుండా తిరుపతి, నెల్లూరుకి చెందిన 10 బృందాలు వారి నృత్యాలతో నగర ప్రజలకు వినోదాన్ని పంచుతారన్నారు.

టెండర్లు ఆహ్వానం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలోని క్యాంటీన్, జిరాక్స్ షాపుల నిర్వహణకు టెండర్లను పిలుస్తున్నట్లు తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మురళి శుక్రవారం మీడియాకు తెలిపారు. 2024 జనవరి 17 నుంచి 2025 జనవరి 16వ తేదీ వరకు క్యాంటీన్, జిరాక్స్ షాపుల నిర్వాహణకు 2024 జనవరి మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకు దరఖాస్తులను స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ కార్యాలయంలో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ముఖ్యం

సత్యవేడు: విద్యా బోధనలో ప్రభుత్వం తీసుకువస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని ఏఎంఓ శివశంకర్, ఏఎల్ఎస్ కో–ఆర్డినేటర్ శ్రీధర్ కోరారు. సత్యవేడు మండలం దాసుకుప్పం, సత్యవేడులో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఏఎంఓ, ఎఏఎస్ కో–ఆర్డినేటర్ సందర్శించారు. వారు మాట్లాడుతూ ఆధునిక విద్యాబోధన పద్ధతులపై నిరంతరం నిర్వహిస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డి, సి గ్రేడ్‌లోని విద్యార్థులను ఏ–గ్రేడ్ లోకి తీసుకు రావాలన్నారు. ఎంఈఓలు రవి, ఉష, హెచ్ఎంలు మొహిద్దీన్, మునిమోహన్, భారతి, లలితకుమారి పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

వరదయ్యపాళెం: టీచర్లు నూతన విద్యా విధానంపై అవగాహన కలిగి ఉండి విద్యార్థులకు బోధించాలని ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య కోరారు. గోవర్ధనపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. విద్యాబోధనలోని కొత్త విధానాలు టీఎల్ఎం పాఠ్య ప్రణాళికలు ఉపయోగించి బోధించాలన్నారు. ఆర్పీలు శ్యామ్ సుందర్, కృష్ణ, హెచ్ఎంలు చంద్రశేఖర్, మాధవయ్య పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. మహిళలు సాయంత్రం పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



నీటి పొదుపుపై ర్యాలీ చేస్తున్న మహిళలు

పాలసముద్రం: తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప తెలిపారు. వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో శుక్రవారం పాలసముద్రం సర్పంచ్ అయ్యప్ప, కార్యదర్శి ఇంద్ర ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ లిల్లీ మాట్లాడుతూ నీటిని అవసరం మేరకే వాడుకోవాలన్నారు. ఒక్క నీటి బొట్టును కూడా వృథా చేయరాదని తెలిపారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం నీటిని పొదుపుగా వాడుకుంటామని ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి

గంగాధర నెల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి మండలంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి కోరారు. ఆయన శుక్రవారం గంగాధరనెల్లూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తల మధ్య విభేదాలను వదిలిపెట్టి పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మంచి జరిగిందని భావిస్తేనే పార్టీకి ఓటు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కోరారని గుర్తు చేశారు. ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసేలా ప్రతి ఇంటికీ వెళతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, జిల్లా రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ సీడీసీఎంఎస్ చైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్ణచంద్రారెడ్డి

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని ఎంపీపీ లత పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని కొనియాడారు. నారాయణస్వామికి మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు మాట్లాడుతూ మండలంలో చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నా ప్రతి పక్షాలు విమర్శలు చేయడం దారుణమన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. టీడీపీ నాయకులు ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇస్తున్నారని, నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్‌లు ధనుంజయవర్మ, సుందర్‌రాజ్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, గోపీనాథ్, పట్టాభిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీటీసీ మురగయ్య, ఉప సర్పంచ్ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్‌తో అప్రమత్తంగా ఉండాలి

- తప్పనిసరిగా మాస్కులు ధరించాలి
- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

కార్వేటినగరం: కోవిడ్‌తో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఆయన శుక్రవారం సీహెచ్‌సీలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో పల్సాక్స్ మీటర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వారు, కిడ్నీ, షుగర్, బీపీ, ఆస్తమా, ఎయిడ్స్ తదితర రోగాలతో బాధపడేవారు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పక్క రాష్ట్రాల్లో కరోనా కేసులు ఎక్కువగా నమోదవుతూ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారు మాస్కులు ధరించాలని సూచించారు. కరోనా లక్షణాలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేసుకోవాలని తెలిపారు. కరోనాను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రులు ఆక్సిజన్ సిలిండర్లు, మందులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆస్పత్రికి పల్సాక్స్‌మీటర్లను వితరణ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రూ.25 లక్షల విలువైన పల్సాక్స్ మీటర్లను వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయవర్మ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, శేషాద్రి, డాక్టర్లు భాగ్యలక్ష్మి, గోపీనాథ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



పల్సాక్స్ మీటర్లు అందజేస్తున్న డాక్టర్ రవిరాజు

వైఎస్సార్ సీపీ గెలుపే అందరి లక్ష్యం



మాట్లాడుతున్న అన్బలగన్, శేఖర్ యాదవ్

పాలసముద్రం: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని జెడ్పీటీసీ అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ కోరారు. వారు శుక్రవారం రాచపాళ్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేశారని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని తెలిపారు. చంద్రబాబు మోసకారి వాగ్దానాలను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోలయ్య, సుందరరాజు, ధనుంజయన్, రవిరెడ్డి, కుట్టి, ప్రకాష్, చిన్నపయ్యన్ పాల్గొన్నారు.